## క్లుప్తంగా

### 'బీఆర్ఎస్ ఎవరి బెదిరింపులకు భయపడదు'


మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్

**అబిడ్స్:** బీఆర్ఎస్ ఎవ్వరి బెదిరింపులకు భయపడదని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ తరహాలో దేశ నలుమూలలా బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తుండడంతో బీజేపీ కక్ష్యతో బీఆర్ఎస్‌ను వేధిస్తుందన్నారు. న్యూ ఢిల్లీలో ఉన్న మంత్రి కేటీఆర్‌ను ఆనంద్‌కుమార్‌గౌడ్ కలిసి ఎమ్మెల్సీ కవితకు సంఘీభావంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈడీ, సీబీఐలు బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేవన్నారు.

### బాధ్యతల స్వీకరణ

**యాకుత్‌పురా:** జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నరసింహ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన అలివేలు మంగతాయారు జాయింట్ కమిషనర్ (ఫైనాన్స్)గా ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో కార్వాన్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహను బదిలీ చేస్తూ కమిషనర్ లోకేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు.

### అమ్మాయిలకు ఆత్మరక్షణ ఎంతో ముఖ్యం


బ్లాక్ బెల్టులు సాధించిన విద్యార్థినులు

**విజయనగర్‌కాలనీ:** మెరుగైన విద్యతో పాటు అమ్మాయిల్లో ఆత్మరక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు విజయనగర్‌కాలనీ సెయింటాన్స్ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ అల్లం విజయరాణి, కరస్పాండెంట్ సిస్టర్ రోజ్‌ఫ్రాన్సిస్, కరాటే మాస్టర్ జె.శ్రీధర్ తెలిపారు. కరాటే శిక్షణలో విజయం సాధించిన విద్యార్థినులకు పాఠశాలలో ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు.

### సీబీఐటీలో అంతరిక్షంపై అవగాహన

**మణికొండ:** గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఇస్రో జైత్ర యాత్రలో భాగంగా శుక్రవారం అంతరిక్షంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో మాజీ శాస్త్రవేత్త వై.శివప్రసాద్ అంతరిక్షం, చంద్రయాన్-1, చంద్రయాన్-2, మంగళయాన్, అంతరిక్ష నౌకల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. 2030 నాటికి మన దేశం సొంత స్పేస్ హౌస్ ఏర్పాటు చేసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా అంతరిక్షంపై క్విజ్ పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ మెథో ఫక్షరమ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ జి.శాంతమూర్తి, డీజీ క్వెస్ట్ చైర్మన్, ఎండీ కె.బాసిరెడ్డిలతో పాటు నిర్వహణ కర్త రామదాసు, ప్రొఫెసర్ వై.రమాదేవి, ఎస్.రమాదేవి, డాక్టర్ పద్మావతి రెడ్డి, కళాశాల పీఆర్‌ఓ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రాచీన కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**హిమాయత్‌నగర్:** ప్రాచీన కళలను ప్రోత్సహించి, వాటికి మరింత ప్రాధాన్యతను ఇస్తూ వాటి ఉనికిని కోల్పోకుండా అందరూ కృషి చేయాలని సాలర్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో 'హ్యాండ్ షాడో పప్పెట్రీ' ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, స్ఫూర్తి థియేటర్ సంయుక్తంగా 7రోజుల పాటు పప్పెట్‌షోను నిర్వహించారు. ముగింపు సందర్భంగా పలు ప్రదర్శనలు నిర్వహించడంతో విద్యార్థులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

### ఉచిత వైద్యశిబిరం అభినందనీయం

**హిమాయత్‌నగర్:** పేదలకు ఉచితంగా కంటికి సంబంధించిన అన్ని వ్యాధులకు చికిత్స అందించడం అభినందనీయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని క్లియర్ విజన్ ఐ ఆసుపత్రిలో గ్లకోమా అవగాహన సదస్సులో భాగంగా వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బండి సంజయ్ సందర్శించారు. శిబిరంలో డాక్టర్ ఎన్.నవీనా(ఐ సర్జన్) చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు.

# నిర్వహణ లేక.. నిరుపయోగంగా..


వాల్మీకీనగర్‌లో..


సుల్తాన్‌షాహిలో..

- శిథిలావస్థలో చేతి పంపులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

**యాకుత్‌పురా:** పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో చేతి పంపులు పని చేయకపోవడంతో స్థానిక ప్రజలకు కనీస అవసరాలకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాకుత్‌పురా, రెయిన్‌బజార్, బ్రహ్మణ్‌వాడీ, తలాబ్‌కట్టా, యత్రరాబ్‌నగర్, ఈస్ట్ చంద్రనగర్, నషేమాన్‌నగర్, భవానీనగర్, సుల్తాన్‌షాహి, వాల్మీకీనగర్, బేలా కాలనీ, మీర్‌కా దొహరా, రాంబక్షిబండ, మొఘల్‌పురా, సరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన చేతి పంపులు శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఎండకాలం కావడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందని బస్తీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అభివృద్ధి నిధులతో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతి పంపుల నిర్వణపై సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుబాటులోని తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

> **చేతి పంపులకు మరమ్మతు చేయించాలి..**
>
> 
>
> బస్తీలో ఉన్న చేతి పంపుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. తాగునీరు తాగడాన్ని ఉపయోగిస్తూ ఇంట్లోని కనీస అవసరాలకు చేతిపంపు నీటిని ఆశ్రయిస్తుంటాం. కొన్ని రోజులుగా చేతిపంపులు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. సంబంధిత అధికారులు బస్తీలో ఉన్న చేతి పంపులకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలి. – రాజేశ్‌యాదవ్, దారుషిఫా

## మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి


నటి శివపార్వతిని సన్మానిస్తున్న జస్టిస్ రాధారాణి తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినందన సంస్థ ఆధ్వర్యంలో పలువురు టీవీ నటులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ సినీనటి రోజారమణికి జీవిత సాఫల్య పురస్కారం, నటి శివపార్వతికి ఆత్మీయ సత్కారం చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండ్గారు సుబ్బారావు, సంస్థ వ్యవస్థాపకురాలు ఇ.భవాని తదితరులు పాల్గొన్నారు.

## సలావుద్దీన్ లోధికి శుభాకాంక్షలు



**శాలిబండ:** చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పాతబస్తీకి చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు గోపీనాథ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపుల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో తిరుపతి శివకుమార్, సంఘం సభ్యులు

**గౌలిపురా:** గౌలిపురాలోని సరస్వతీ అకాడమీలో పాతనగర మున్నూరు కాపు సంఘం సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా తిరుపతి శివకుమార్‌ను సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆర్యదత్తు, ప్రధాన కార్యదర్శిగా చుక్కా అశోక్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా బాలరాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాతనగర మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. పాతనగర మున్నూరు కాపు సంఘానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. తనకు అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పాతనగర మున్నూరు కాపు సంఘం సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాతనగర మున్నూరు కాపుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళతానన్నారు.

## బీజేపీ సంబరాలు

**గోల్కొండ:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థి బీఆర్ఎస్ పతనానికి సూచిక అని గుడిమల్కాపూర్ బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో విజయ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి ఊబిలో నిండా మునిగిందన్న విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశ్విన్, ప్రభు పూజారి, పవన్‌సింగ్ లోద్ తదితరులు ఉన్నారు.

## మచ్చీమార్కెట్ వ్యాపారులకు న్యాయం చేస్తాం


మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్‌ను కలిసిన జలక్షత్రీయ గంగపుత్ర సంఘం నాయకులు

**అబిడ్స్:** మచ్చీమార్కెట్ వ్యాపారులకు న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం జలక్షత్రీయ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు వినోద్ సింగ్, ఇతర నాయకులు సురేందర్ సింగ్, సుదేష్ సింగ్, ముఖేష్ సింగ్, సతీష్ సింగ్, మోతీ సింగ్ తదితరులు కలిసి బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో పాత, కొత్త వారితో పాటు అందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. అందరికీ న్యాయం జరిగేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

## అన్నదానం


అన్నదానం చేస్తున్న బషీరుద్దీన్


**గోల్కొండ:** నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేస్తూ సంవత్సరం పూర్తయిందని, ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించేందుకు కృషి చేస్తున్నానని ప్రముఖ సంఘ సేవకుడు, గోల్కొండ ఉర్దూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీరుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు ఆహారం ప్యాకెట్లను అందజేశారు. శ్రేయోభిలాషులు, తోటి ఉద్యోగుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## బంగారు లక్ష్మణ్‌కు నివాళి


బంగారు లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**గౌలిపురా:** భారతీయ జనతా పార్టీ యాకుత్‌పురా అసెంబ్లీలో సీనియర్ నాయకులు ఆదర్శ మహేశ్ ఆధ్వర్యంలో బంగారు లక్ష్మణ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సేవలో చిన్నప్పటి నుంచి దేశం మీద ధర్మం మీద అభిమానంతో బీజేపీ పార్టీ సిద్ధాంతాలను నమ్మి బీజేపీలో అనేకమైన కార్యకర్తలను నిర్మాణం చేసి తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉనికిని కాపడుతూ పాత పట్టణంలో మతోన్మాదానికి ధీటుగా రాణించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, జుమ్మేరాత్‌బజార్ శేఖర్, ధీరజ్‌లాల్, కొడి సురేందర్, వీరేందర్ యాదవ్, సుమన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల స్వైర విహారం


గుడిమల్కాపూర్‌లో సంచరిస్తున్న వీధి కుక్కలు

**గోల్కొండ:** నగర వాసులకు వీధి కుక్కల బెడద వదలడం లేదు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలో వారం రోజులుగా వీధి కుక్కలు రెచ్చిపోయి రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. బల్దియా వారు చేపట్టిన ప్రత్యేక చర్యలు కేవలం కాగితాలకే పరిమితం అయిపోయాయి. గుడిమల్కాపూర్‌లోని శారదానగర్, ఎస్‌బీఐ కాలనీ, మాసబ్‌ట్యాంక్, అహ్మద్‌నగర్ కాలనీల్లో కుక్కలు గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వరుసగా కుక్కకాటు సంఘటనలు వెలుగు చూడటంతో కుక్కను చూడగానే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మెహిదీపట్నం డివిజన్‌లోని అయోధ్యనగర్ కాలనీ వీధుల్లో రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా చెత్త కుప్పల వద్ద కుక్కలు గుంపులుగా చేరి చెత్తను చిందరవందర చేస్తున్నాయి.

## కార్పొరేటర్ పర్యటన



**రాజేంద్రనగర్:** అభివృద్ధి పనుల్లో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మిగూడ, బృందావన్ కాలనీలో బాక్స్ డ్రైనేజీ నాలా పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. నాలా విస్తీర్ణం, పొడవులో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. జనార్దన్, శివశంకర్, మధుకర్, రాజేందర్‌సింగ్, పవన్, చిన్న, ధశంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

**గోల్కొండ:** కాంట్రాక్టర్లు చేస్తున్న అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన బల్దియా అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులతో ఎండీలైన్స్ ఒవైసీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లోపంతో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావడం లేదన్నారు. వచ్చేవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభంకానున్నాయన్నారు. రోడ్లపై తవ్వి వదిలేసిన గుంతలను పూడ్చివేయాలని, డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన సూచించారు. మజీదుల పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయిస్తుండాలని ఆయన అన్నారు. దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేయించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వరదనీటి పైప్‌లైన్ పనులలో మరింత వేగం పెంచి వర్షాకాలానికంటే ముందే వాటిని పూర్తి చేయాలని ఆయన సూచించారు. నాలాల్లో పూడికతీత పనులు చేపట్టి పూడిక వ్యర్థాలను తొలగించాలని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకట చైతన్య, డిప్యూటీ ఈఈలు రామకృష్ణ, శంకర్, ఏఈలు శ్రీకాంత్, ఉదయ్, కాంట్రాక్టర్ల ప్రతినిధి ఎస్.రమేష్, కార్పొరేటర్ మహ్మద్ నసిరుద్దీన్, హారూఫ్ ఫర్హాన్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం

**గోల్కొండ:** షేక్‌పేట డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫర్హాజ్‌ఉద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని గుల్షన్‌కాలనీ, లక్ష్మణ్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు వేయించామన్నారు. అంతేకాకుండా డ్రైనేజీలు పొంగిపొర్లకుండా కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు వేయించామని తెలిపారు. డివిజన్ పరిధిలో ఉన్న ఓపెన్ జిమ్‌లు, పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫర్హాజ్

## 'నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తా'


సభలో పాల్గొన్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

**అబిడ్స్:** నిరుపేద ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు గడ్డం గంగాధర్ ఫౌండేషన్ తరఫున ఉచితంగా విద్యనందిస్తామని ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఆగాపురా ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. 500 మంది బస్తీవాసులు పాల్గొన్న ఈ సభలో గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థినీ విద్యార్థులను ఆదుకుంటామన్నారు. ఆగాపురా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జియో కమల, సయ్యద్ పాషా, మోసీన్, జయశంకర్, గణేష్, భారతి, సురేష్, మేగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నాం'

**జియాగూడ:** విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని ఏపీ, తెలంగాణ కృష్ణవేణి హైస్కూల్ విద్యాసంస్థల చైర్మన్ ఎంఎం షరీఫ్, వైస్ చైర్మన్ ఐఐటీ శ్రీనివాస్, అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జియాగూడ, రహింపురా కేటీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవం జరిగింది. అనంతరం జాతీయ, అంతర్జాతీయ క్రీడలు, కరాటే, యోగా, డ్యాన్స్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను సన్మానించారు. డైరెక్టర్స్ సురేష్‌రెడ్డి, వెంకట్‌రామిరెడ్డి, రమేష్‌యాదవ్, గోల్కొండ జిల్లా బీజేపీ డైరీ ఫారం కన్వీనర్ శివకుమార్ యాదవ్, కోచర్ల శివ, ఎంకే బాలాజీ పాల్గొన్నారు.


విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంఎం షరీఫ్, శ్రీవాస్, జైపాల్‌రెడ్డి

## పాత కక్షలతో విద్యార్థిపై దాడి.. నిందితుడి అరెస్టు

**అబిడ్స్:** పాత కక్షలతో ఓ విద్యార్థిపై కత్తితో దాడి చేసిన ఘటన షాయినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోషామహల్ జోషివాడికి చెందిన గౌరవ్‌వ్యాస్(20) డిగ్రీ చదువుతున్నాడు. అదే ప్రాంతానికి సమీపంలో నివసించే అంకిత్‌సింగ్(20) వృత్తిరీత్యా మోటారు మెకానిక్. వీరిద్దరి మధ్య ఈనెల 6న గొడవ జరిగింది. తాగిన మైకంలో ఉన్న అంకిత్ సింగ్ ఆ విద్యార్థి పట్ల దుర్భాషలాడటంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకున్న అంకిత్‌సింగ్ అవకాశం కోసం ఎదురుచూసి గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఒంటరిగా వెళ్తున్న గౌరవ్‌వ్యాస్‌ను అడ్డుకున్నాడు. జరిగిన గొడవను మర్చిపోదాం, కలిసి మాట్లాడుకుందాం రా.. అంటూ ద్విచక్ర వాహనంపై వెనకాల సీటులో కూర్చున్నాడు. కొంత దూరం వెళ్లేసరికి తనతో తెచ్చుకున్న పదునైన స్క్రూ డ్రైవర్ (కత్తి లాంటి దాని)తో గౌరవ్ వ్యాస్ వీపుపై మూడుసార్లు పొడిచాడు. తప్పించుకునే యత్నంలో గౌరవవ్యాస్ ద్విచక్ర వాహనం వదిలి పారిపోతుండగా మరోసారి పొడిచాడు. దీంతో వీపుపై మూడు పోట్లు, చేతికి మరో పోటు గాయాలు కావడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ. లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నాడు. నిందితుడిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసి దాడికి ఉపయోగించిన పదునైన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు ప్రస్తుతం ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు.

# టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి



ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**గన్‌ఫౌండ్రీ:** టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనిత రామ్‌చంద్రన్ రాజీనామా చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం చూస్తుంటే నిరుద్యోగుల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టంగా కనబడుతుందని దుయ్యబట్టారు. నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో పోలీసులు ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవన్, రాజు, మహిళా విభాగం కన్వీనర్ సిరివెన్నెల తదితరులు పాల్గొన్నారు.

### టీఎస్‌పీఎస్సీ వద్ద భారీ భద్రత..

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించి విద్యార్థి సంఘాల ఆందోళనల నేపథ్యంలో పోలీసులు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌యూఐ, బీజేపీతో పాటు పలువురు టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరికలు ఇవ్వడంతో ముందస్తుగా భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

### నష్టపోయిన అభ్యర్థులకు రూ.లక్ష పరిహారం ఇవ్వండి


దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు గోపాల్‌జీ, కృష్ణ

**అబిడ్స్:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో నష్టపోయిన అభ్యర్థులందరికీ రూ.లక్ష చొప్పున సీఎం కేసీఆర్ ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ డిమాండ్ చేశారు. బీజేపీ చేపట్టిన గన్‌పార్కు దీక్షలో వారు పాల్గొని బండి సంజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ, కృష్ణ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి నిరుద్యోగ విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.